# తొలి పలుకు

*"దేవుడు తన స్వరక్తమిచ్చి సంపాదించిన తన సంఘమును కాయుటకు పరిశుద్ధాత్మ మిమ్మును దేనియందు అధ్యక్షులనుగా ఉంచెనో ఆ యావత్తుమందను గూర్చియు, మీ మట్టుకు మిమ్మును గూర్చియు జాగ్రత్తగా ఉండుడి" (అపో. 20:28).*

"పాపులను రక్షించడానికి క్రీస్తు లేని సిలువ ఎంతో సిలువ లేని క్రీస్తు కూడా అంతే శక్తి హీనుడైయుంటాడ"నే వాస్తవంతో పాప పరిహారమనే క్రొత్త నిబంధన భావనను బాగుగా ఎరిగినవారు ఏకీభవిస్తారు. ఏదియెలాగున్నా, సువార్త యొక్క శుభ వచనమేమంటే – దేవత్వంలో రెండవ వ్యక్తియైన, దేవుని అభిషిక్తుడగు క్రీస్తు, మన పాపముల నిమిత్తము తన భౌతిక కాయమును, ప్రాణమును సిలువపై అర్పించాడు (1 కొరింథీ. 15:3). క్రీస్తు సిలువ లేనివాడు కాడు, మరియు సిలువ క్రీస్తు లేనిదీ కాదు – తత్ ఫలితంగా, పాపియైన నరుడు, నిరీక్షణ లేనివాడు కాడు!

మానవుని కొరకు దేవుని కుమారునివలన సిలువలో చేయబడిన యాగమే బైబిలు కథకు ప్రధాన స్థానమైయుంది. రాజ లాంచనపు కల్వరి రక్తంతో క్రొత్త నిబంధన యొక్క తళుకు వస్త్రానికి అద్దకం వేయబడింది. ప్రవచనపు ముందు హెచ్చరికలతో కూడిన పాత నిబంధన పేజీలును, వాస్తవిక చరిత్రతో కూడిన క్రొత్త నిబంధన పుటలును క్రీస్తు రక్తంతో బొట్లు బొట్లుగా కారునట్లు తడిశాయి. క్రీస్తు జీవితంలోని కడపటి మూడు దినాల చరిత్ర నాల్గు సువార్త రచనల్లో ఐదవ వంతు స్థానాన్ని ఆక్రమించినట్టు హెన్రీ సి. థెయిసన్ లెక్కించాడు. ఆయన మరణంవలెనే, ప్రభువు యొక్క మూడున్నర సంవత్సరాల బహిరంగ పరిచర్య కూడా వివరించబడి ఉన్నట్టయితే సువార్త రచనలు 8,400 పేజీలంత పెద్ద పుస్తకమై యుండేదే అని అతడు వ్రాశాడు.[1] క్రొత్త నిబంధనలో ప్రతి 53 వచనాలకు క్రీస్తు మరణాన్ని గూర్చి ప్రత్యేకంగా చెప్పబడిన 1వ వచనం ఉన్నట్టు ఆర్. ఏ. టోరీ అంచనా వేశాడు.[2]

లోకంలో తీసివేతగా ఉన్న దానంతటికి సిలువ కూడిక గుర్తుగా నిలిచియుంది. సిలువనే లేఖనాల్లోనుండి ఎత్తివేసినట్లయితే, బైబిలు కీకారణ్యంలో తొర్ర చేయబడిన ఒక మానులా ఉండేదే. పాపం నిమిత్తం దైవికమైన బలి అర్పణను కేంద్రంగా కలిగి, ఆ బలి మృతులలోనుండి పునరుత్థానం పొందినట్లున్న మతం, లోకమంతటిలో క్రైస్తవ్యం ఒకటే.

పాపము పాపులు, దోషారోపణ మరియు దేవుడు లేని స్థితి, ఎడబాటు మరియు వేదనలతో కూడియున్న ఈ లోకంలో; రక్షించడానికి సిలువ దేవుని శక్తియై ఉంది. "సిలువనుగూర్చిన వార్త, నశించుచున్న వారికి వెఱ్ఱితనము గాని రక్షింపబడుచున్న మనకు దేవుని శక్తి" (1 కొరింథీ. 1:18); "ఆయనే మన పాపములకు శాంతికరమై యున్నాడు; మన పాపములకు మాత్రమేకాదు, సర్వలోకమునకును శాంతికరమై యున్నాడు" (1 యోహాను 2:2) అని వ్రాయబడియుంది.

దేవునినుండి దూరమైన స్థితి, దేవునితో ఐక్యతలేని స్థితి అనే ఆత్మ సంబంధమైన పొందికలేమి – రవరవలాడుతున్నప్పుడు, సమాధానానికి, సమాధానపరచడానికిని ఉన్న దేవుని ఏకైక పనిముట్టు లేక పరికరం సిలువయే. పౌలు యిలా వ్రాశాడు, "ఆయన సిలువరక్తముచేత సంధిచేసి, ఆయనద్వారా సమస్తమును, అవి భూలోక మందున్నవైనను పరలోకమందున్నవైనను, వాటినన్నిటిని ఆయనద్వారా తనతో సమాధానపరచుకొన వలెననియు తండ్రి అభీష్టమాయెను" (కొలస్సీ. 1:20). ఎఫెసీ. 2:14–16 యిలా అంటుంది, "ఆయన మన సమాధానమైయుండి మీకును మాకును ఉండిన ద్వేషమును ... తన శరీరమందు కొట్టివేయుటచేత మధ్యగోడను పడగొట్టి, మన ఉభయులను ఏకముచేసెను. ఇట్లు సంధిచేయుచు, ఈ యిద్దరిని తనయందు ఒక్క నూతన పురుషునిగా సృష్టించి, తన సిలువవలన ఆ ద్వేషమును సంహరించి, దాని ద్వారా వీరిద్దరిని ఏకశరీరముగా చేసి, దేవునితో సమాధానపరచవలెనని యీలాగు చేసెను ..."

ఎక్కడ ఆత్మ సంబంధమైన ఆకలి, పేదరికం దారిద్ర్యం విస్తరించిందో, దేవుని విమోచనా ఏర్పాట్లు, ఆయన నీతి కలిమి ఐశ్వర్యం అనేవి ఆ సిలువ అంచున పంచిపెట్ట బడుతున్నాయి. "మేము సిలువ వేయబడిన క్రీస్తును ప్రకటించుచున్నాము" అని పౌలు తెలియజేశాడు. ఆ సిలువ వేయబడిన క్రీస్తే "మనకు జ్ఞానమును నీతియు పరిశుద్ధతయు విమోచనమునాయెను" (1 కొరింథీ. 1:23, 30) అని యింకను ఎరుక చేశాడు.

నిరాక్షేపంగా, క్రీస్తు సిలువ బైబిలు వర్తమానానికి ప్రధాన భాగంగాను, కేంద్ర స్థానంగాను ఉండేటట్లు పరిశుద్ధాత్మ వెలుగునింపాడు.

విమోచనా విషయంలో, సిలువ యితర సత్యాలతో ముడివేయబడినందువల్ల, స్వాస్థ్య కిరణాలు సూర్యునినుండి వచ్చునట్లుగాను, ఊటనుండి సెలయేరు ప్రవహించునట్లుగాను, సంఘము సిలువనుండి పొర్లి వస్తుంది. ఇది సత్యమని క్రొత్త నిబంధన క్రమ అధ్యయనం స్థిరపరుస్తోంది. క్రీస్తులేని క్రైస్తవ్యం ఉండదు; సరిగదా శరీరంలేని శిరస్సు, శిరస్సులేని శరీరం అనేవి ఎలా ఉండవో అలాగే సంఘంలేని క్రైస్తవ్యం కూడా ఉండదు. క్రొత్త నిబంధన యొక్క ప్రత్యేక లక్షణమేమంటే, సిలువయు సంఘమును సన్నిహితంగా కలిసిపోయి, నశించిన మానవ జాతికి దేవుని పాలనలో కృప కలుగగా ఒకే ఏర్పాటులోనికి ఒక్కటిగా చేర్చబడ్డాయని ప్రకటించడమే. సకల భూ దేశాల జనులందరిలోనుండి, సిలువవలన దేవుడు ఒక నూతనమైన కుటుంబాన్ని – క్రీస్తుకు చెందిన జనాన్ని – తాను ఏర్పరచుకొన్న ప్రజలుగా ఉండడానికి పిలుస్తాడు.

ఈ ఆలోచనతో ముందుకు సాగుదాం: సంఘము సిలువతో ఎలా సంబంధం కలిగియుంది? సిలువ, సంఘములనేవి ఒకదానితోనొకటి ఎలాటి బాంధవ్యం కలిగి

ఉన్నాయి? సిలువ సంఘం కొరకు ఏమి చేస్తుంది?

## దానిచే సృజింపబడింది

మొదట, సిలువ సంఘాన్ని సృజిస్తుంది. పాపులకు విమోచనం కలగడం ద్వారా సంఘం ఉనికిలోనికి వస్తుంది. సిలువలేకపోతే, సంఘం ఉండదు.

తన రక్షకునిగా మరియు దేవుని కుమారుడుగా, ఒక వ్యక్తి విధేయతతో కూడిన విశ్వాసాన్ని క్రీస్తుకు కనుపరచినప్పుడు, క్రీస్తు రక్తముతో అతడు తన పాపమును కడుగబడినవాడౌతాడు (అపో. 22:16). అలా కడుగబడడం ద్వారా, విమోచన పొందిన సమాజంతో అతడు చేరుతాడు, అది రక్షింపబడిన సమాజం; క్రొత్త నిబంధన దానిని "సంఘం" అని పిలిచింది. ఈ కారణాన్ని బట్టి, ప్రభువు తన స్వరక్తంతో సంఘాన్ని కొన్నట్టు పౌలు చెప్పాడు. అతడు ఎఫెసు స్థానిక సంఘ పెద్దలతో యిలా అన్నాడు, "దేవుడు తన స్వరక్తమిచ్చి సంపాదించిన తన సంఘమును కాయుటకు పరిశుద్ధాత్మ మిమ్మును దేనియందు అధ్యక్షులనుగా ఉంచెనో ఆ యావత్తుమందను గూర్చియు, మీ మట్టుకు మిమ్మును గూర్చియు జాగ్రత్తగా ఉండుడి" (అపో. 20:28). స్పష్టంగా, సంఘం కొరకు ప్రభువైన యేసు సిలువలో మరణించారు. "క్రీస్తుకూడ సంఘమును ప్రేమించి … దానికొరకు తన్ను తాను అప్పగించుకొనెను" అని పౌలు తెలియజేశాడు (ఎఫెసీ. 5:25). క్రీస్తు మరణం యొక్క ఉద్దేశం: లోకమందు క్రీస్తుతో సహవాసం కలిగి జీవించుతూ, ఆత్మ సంబంధమైన తన పనికి తమను తాము అప్పగించుకునే ప్రజలను, "పిలువబడిన వారిని" ప్రసాదించడమే. "ఆయన సమస్తమైన దుర్నీతినుండి మనలను విమోచించి, సత్ క్రియలయందాసక్తిగల ప్రజలను తన కోసరము పవిత్రపరచుకొని తన సొత్తుగా చేసికొనుటకు తన్ను తానే మనకొరకు అర్పించుకొనెను" అని పౌలు తీతుకు వివరించాడు (తీతు 2:14).

దక్షిణపు ఆర్కన్సాస్‌లో సువార్త కూడికలో నేనొక రాత్రి ప్రసంగించిన తరువాత అసాధారణమైన విషాధ గాధగల ఒక యువతి నా వద్దకు వచ్చింది. నాలుగేండ్ల ప్రాయంలో, ఆమె డెల్లాస్, టెక్సాస్‌లో ఉన్నప్పుడు జరిగిన ఒక సంఘటనను గూర్చి నాతో చెప్పింది. అప్పుడు వారి ఇల్లు రద్దీగా ఉండే హైవే రోడ్డు ప్రక్కనే ఉండేదట. వాళ్ళ ఆవరణలో పిల్లలు ఆడుకోడానికి ఎక్కువ స్థలం లేదు. ఒకనాటి సాయంత్రం, యిరుగు పొరుగు పిల్లలతో కలిసి ఆమె చిన్న ఆవరణంలో బంతితో ఆడుకొంటోంది. అది ఏ రకమైన బంతో తనకు జ్ఞాపకం లేదు అని ఆమె అంది, అయితే అది ఆమె వద్దనుండి ఎగిరి రోడ్డుమీదికి దొర్లుకుంటూ పోయింది. ఏమీ ఆలోచించకుండా ఆమె దానివెంట పరుగెత్తిందట. దాన్ని పట్టుకొనడానికి ఆమె సమీపిస్తుండగా, రోడ్డు మీద శరవేగంగా దూసుకొని వస్తున్న పెద్ద లారీని చూచేటప్పటికి భయంచేత ఆమె గడ్డకట్టుకునిపోయినట్టు బిగుసుకొని పోయిందట. ఆ సమయంలో తొమ్మిది సంవత్సరాలవాడైన ఆమె అన్న, ఆమెను చూచి పరిగెత్తుకొంటూ వచ్చాడట. అతడు కూడా ఆ లారీని చూచాడు, మెరుపులా, అతడు ఆమె వెంట పరుగెత్తి, ఆమెను క్షేమమైన స్థలానికి తోడుకొని రావడానికి వచ్చాడట.

ఆ లారీ ముందుకు అతడు పరుగెత్తి ఆమెను మార్గంలోనుండి తొలిగించాడట, మీదకొచ్చిన మరణంనుండి ఆమెను రక్షించాడు. తన యౌవన జీవితానికి రిస్కు తీసికొన్నాడు. ఆ కొన్ని క్షణాలలో తన చిన్న చెల్లిని రక్షించగలిగాడు. కాని తనను తాను రక్షించుకోలేక పోయాడు. లారీ అతని మీదికి దూసుకొనిపోయింది, అక్కడికక్కడే అతడు చనిపోయాడు.

ఆ విపత్తును గూర్చిన వివరాలు తనకు గుర్తులేవని ఆ యువతి చెప్పింది, కాని తన అన్న మృత దేహాన్ని రోడ్డుమీదనుంచి ఎత్తి, ఒక అంబ్యూలన్స్ వచ్చి తీసుకొనిపోయే వరకు తమ యింటి ముంగిట పెట్టబడిన సంగతిని మాత్రం ఆమె జ్ఞాపకం చేసికో గలిగింది. గాఢమైన భావంతోనూ, మాటల్లో వర్ణించలేనంత యథార్థమైన అభినంద నతోనూ, "మా అన్నయ్య నా కొరకు చనిపోయాడు" అని చెప్పింది. ఆమె ఒక విశ్వాసంగల క్రైస్తవ స్త్రీ. ఆమె జీవితానికిని, నేడు సంఘంలోని ఆమె పరిచర్యకును అవకాశం, అనేక సంవత్సరాల క్రిందట ఆమె అన్నయ్య చేసిన త్యాగంవలన ఏర్పడింది.

అలాటిదే, కాని అంతకంటే యింకా ఎంతో గాఢంగా, సంఘము తన జీవితాన్ని ప్రభువైన యేసు త్యాగంనుండి పొందుతోంది. ఆయన మరణం మనం జీవితంలోనికి ప్రవేశించే అవకాశం మాత్రమే కాక, కొనసాగే జీవితానికి మూలం కూడా అయింది. ఆయన మరణము మనకు పరిహారార్థ బలియు, మన గత పాపములకు క్షమాపణ మార్గమునై ఉంది. ప్రభువైన యేసు ఈ లోకమునకరుదెంచి, దేవుడు – మానవుడుగా మన మధ్య సంచరించి, తన కొరకు, "దేవుని సొత్తయిన ప్రజలను" (1 పేతురు 2:9) సంపాదించుకొనడానికి మృతిపొందాడు. సంఘము (చర్చ్) ఇటుకలు, అడుసుతో కట్టబడేది కాదు; అది రక్తంచే కొనబడిన ప్రజలతో కూడినది.

క్రీస్తు యుగానికి మనం మూడు విధాలుగా స్పందింపవచ్చు. మొదటిది, క్రీస్తు ప్రభువు చేసిన దానిని అభినందిస్తూ, సిలువను మనం కౌగలించుకొంటాం. విమోచనం పొందినవాళ్ళు క్రీస్తు అనుగ్రహించు కృపయొక్క బహుమానానికి కృతజ్ఞతా పూర్వకంగా ఆనందిస్తారు! క్రీస్తు పరలోక మహిమతో ఐశ్వర్యవంతుడై ఉన్నాడు; మనకొరకు ఆయన పరలోకమును వీడి ధరకేతెంచి, దరిద్రుడయ్యాడు. తన దారిద్ర్యంవలన మనలను ఆత్మ సంబంధమైన ధనవంతులుగా చేయడానికే యిలా చేశాడు (2 కొరింథీ. 8:9). రెండవది, ఆయన మరణాన్ని సద్వినియోగం చేసికొనడంవలన ప్రతిక్రియ జరపాలి. నిజమైన అభినందన సద్వినియోగం చేసికొనేలా ప్రేరేపిస్తుంది. క్రీస్తునందుగల విశ్వాసము, విధేయతవలన, ఆయన మరణం యొక్క ప్రతిఫలాలను మన జీవితంలోనికి మనం అంగీకరిస్తాం (రోమా 6:1–4). ఆయన అందరికొరకు మృతిపొందాడు (హెబ్రీ. 2:9), కాని తనకు విధేయులైనవారు మాత్రమే ఆయన మరణం యొక్క ఉపకారాలను పొందుతారు (హెబ్రీ. 5:8, 9). మూడవది, ఆయన కార్యాభివృద్ధియందు ఆసక్తి కలిగియుండడంతో ఆయన బలికి మనం విధేయతను కనుపరచాలి (1 కొరింథీ. 15:58). జిహ్వానుండి కాలివ్రేలివరకు – మన శరీరం, ఆత్మ, ప్రాణాలతో సహా ఆయనకు చెందినవారమై యుంటాం (1 కొరింథీ. 6:19, 20). అలాగే, ఈ లోకంలో మన పని ఏమంటే – ఆయన రూపుదిద్ది, నడిపించి, ఆనందించే సేవను మనం ఆయనకు సమర్పించ బద్ధులమై ఉన్నాం.

## దానిచే శుద్ధమైనది

రెండవది, సిలువ సంఘాన్ని ఎడతెగకుండ శుద్ధం చేస్తుంది. పవిత్రం చేయగల శక్తి దేవుని జనులకు, వారి ద్వారానే సమకూరుతుంది. మన భౌతిక దేహంలోని రక్తము మనలోగుండ ఎంత నిశ్చయంగా ప్రవహిస్తూ, శుద్ధీకరిస్తూ, నిలబెట్టుతుందో, అలాగే క్రీస్తు యొక్క ప్రశస్తమైన రక్తము జీవితాన్ని తట్టుకోగలిగిన శక్తితో అతని జనులలోగుండా ప్రసరిస్తుంది.

మనం కేవలం రక్షణ కావలసిన వాళ్లం మాత్రమే కాదు, రక్షణలో కొనసాగ వలసినవాళ్ళం. ఒక పాపి, క్రీస్తు సువార్తకు లోబడడం ద్వారా, ఆయన రక్తంలో కడుగబడినవాడై, దైవికమైన కృపచేత క్రీస్తులోనికి వచ్చిన ప్రతిసారి సంఘం సృజింపబడుతుంది. తాను అనుదినం వెలుగులో నడుస్తున్నందున, క్రైస్తవుడు రక్తంచేత కడుగబడుతునే ఉంటాడు. యోహాను యిలా వ్రాశాడు, “అయితే ఆయన వెలుగులోనున్న ప్రకారము మనమును వెలుగులో నడిచినయెడల, మనము అన్యోన్యసహవాసము గలవారమై యుందుము; అప్పుడు ఆయన కుమారుడైన యేసు రక్తము ప్రతి పాపమునుండి మనలను పవిత్రులనుగా చేయును” (1 యోహాను 1:7). గ్రీకు భాషలో యోహాను “పవిత్రులనుగా చేయును” అనేదాన్ని వర్తమాన అసమాపక క్రియలో ఉంచాడు. అది ఎడతెగక, కొనసాగి కడుగుతుందనే వాస్తవాన్ని సూచిస్తుంది.

---

**సిలువ లేనియెడల**
**సంఘము లేదు.**

---

అనుదినము ప్రభువునందు వృద్ధిపొందుతూ, పాపము చేయకుండా బతకాలని ప్రయాసపడేవాడైనా, క్రైస్తవుడు పరిపూర్ణుడైన వ్యక్తి కాదు. తప్పు చేయనివాడు కాదు, అయితే అతడు నిందారహితుడైయుండాలి. పాపి జీవితంలోగల పాపం క్రీస్తు రక్తంవలన కడుగబడవలసి ఉంది. పరిశుద్ధుని జీవితంలోని పాపము, క్రీస్తు రక్తంవలన రక్షింపబడిన స్థితిలో అతన్ని లేక ఆమెను నిలుపుతుంది. ఈ లోకంలో పాపక్షమాపణ అవసరం లేని స్థితికి మనం ఎన్నడు ఎదగం.

మన పిల్లలు పసివారుగా ఉన్నప్పుడు సైకిలు తొక్కడాన్ని నేర్చుకోడం చూడ ముచ్చటిగా ఉంటుంది. క్రొత్తగా దీన్ని నేర్చుకోడంలో రెండు ప్రాథమిక సమస్యలను వారు ఎదుర్కొంటారు: సైకిలును పైకి లేపి నిలబెట్టడం, మరియు నిలబడిన స్థితిలో దాన్ని నిలపడం. “నీవు దాన్ని తొక్కుతూనైన ఉండు, సైకిలు మీదనుండి దిగు లేక పడు,” అని ఒక బిడ్డ అన్నాడు. మొదటి పని వారికి సులభమే. సీటు మీద ఎక్కి కూర్చుండి పెడల్ మీద ఒక కాలుపెట్టి, ఊపు కొరకు నెట్టుకొనడం. రెండో భాగం భయపెడుతుంది. సైకిలును పైకి నిలపాలంటే తగినంత వేగంగా అది ముందుకు పోతూ ఉండాలి. రెండవ పని చేయలేకపోతే, అది పడిపోడానికి, తొక్కేవాడు గాయపడడానికి

వీలుంటుంది.

సైకిలును తొక్కడం నేర్చుకోడాన్ని పోలి, రక్షణ కూడా రెండు కొలతలు కలిగియున్నట్టు చూడనగును: మొదటిగా పాపి దేవునితో సరియైన బాంధవ్యంలో నిలపబడాలి, తరువాత దేవునితోగల సరియైన బాంధవ్యంలో అతడు నిలిచియుండాలి. సరియైన బాంధవ్యం కలిగియుండడం అవసరం, అయితే అది కేవలం ఆరంభం మాత్రమే. మొదటి స్థానంలో ఏ సమస్య అతన్ని పాపిగా చేసిందో – అతడు క్రైస్తవుడైన తరువాత నిరంతరం కడుగబడకపోతే – అదే సమస్య అతన్ని దోషియని తీర్పు తీర్చానిస్తుంది (అపొ. 8:22). క్రైస్తవుడు కాకమునుపు అతనికి పాపములనుండి రక్షణ అవసరమైతే, క్రైస్తవుడైన పిమ్మట పాపములనుండి రక్షణ అవసరం లేదా?

అతడు "వెలుగులో నడుస్తున్నంత" కాలం క్రైస్తవుడు రక్షింపబడిన స్థితిలో ఉంటాడు. అపొస్తలుడైన యోహాను ప్రకారం, వెలుగులో నడవడం – ఆత్మ సంబంధమైన రెండు గుణగణాలతో కూడినదై ఉంది. రక్షణ కొరకు ప్రభువైన యేసునందు నమ్మిక ఉంచడంతో అది ఆరంభమౌతుంది: "ఆయనే మన పాపములకు శాంతికరమై యున్నాడు; మన పాపములకు మాత్రమేకాదు, సర్వలోకమునకును శాంతికరమై యున్నాడు" (1 యోహాను 2:2). వాస్తవంగా, రక్షణను మనం సంపాదించుకొనలేం (ఎఫెసీ. 2:8, 9). విశ్వాసంతో కూడిన విధేయతను తనపట్ల కనపరచినట్లయితే మనలను రక్షిస్తానని ప్రభువైన యేసు తెలిపాడు. తాను వాగ్దానం చేసినది నెరవేర్చేవాడని మనం ఆయనయందు స్థిరమైన నమ్మకముంచాలి. మనం వెలిచూపుతో కాక విశ్వాసంతో నడవాలి (2 కొరింథీ. 5:7).

వెలుగులో నడవడంలో, ఆయన చిత్తాన్ని నిష్కపటంగా జరిగించడం కూడా అవసరమైయుంటుంది. యోహాను యిలా వ్రాశాడు, "మనమాయన ఆజ్ఞలు గైకొనుటయే దేవుని ప్రేమించుట ..." (1 యోహాను 5:3); "ఆయనను ఎరిగియున్నానని చెప్పుకొనుచు, ఆయన ఆజ్ఞలను గైకొననివాడు అబద్ధికుడు; వానిలో సత్యములేదు. ఆయన వాక్యము ఎవడు గైకొనునో వానిలో దేవుని ప్రేమ నిజముగా పరిపూర్ణమాయెను" (1 యోహాను 2:4, 5). గనుక, వెలుగులో నడవడం అంటే, మనం మన పాపములను అంగీకరించడం (1 యోహాను 1:8, 10), మన పాపములను దేవుని యెదుట ఒప్పుకొనడం (1 యోహాను 1:9); మన సామర్థ్యానికి తగినట్టు మనం నడవడం (1 యోహాను 2:29). ఆయన నడిచినలాగు నడవడం (1 యోహాను 2:6), అంతేగాక దేవునినుండి అనుగ్రహింపబడిన పరిశుద్ధ లేఖనాలను యథార్థంగా వెంబడించడం (2 తిమోతి 3:16).

## దానిచే బలవంత పెట్టబడింది

మూడవది, సిలువ ఒత్తిడిని తెస్తూ సంఘాన్ని చురుకుగా పని చేయిస్తుంది. క్రీస్తు ప్రభువు కోరిన జనులుగా మనం ఉండేటట్లూ, ఆయన కోరిన పనిని మనం చేసేటట్లూ, సంఘం యొక్క హృదయంలో ఆత్మ సంబంధమైన ఉద్దేశాన్ని అది లోతుగా నాటుతుంది.

క్రైస్తవునికి నిరంతరమైన శుద్ధీకరణ మాత్రమే గాక, అంతరంగ ప్రేరేపణ, వ్యక్తిగతమైన శక్తి కూడా అవసరం. క్రైస్తవ్యం గంభీరమైన అనేక ఉద్దేశాలను ప్రసాదిస్తుంది. వీటిలో

దేవుని కృప అనేది అత్యున్నతమైనదియు, మరి స్థిరమైనదియునై ఉండవచ్చు. సిలువ వశపరచుకొంటుంది, బలవంతపెడుతుంది కూడా. "నేను భూమి మీదనుండి పైకెత్తబడిన యెడల అందరిని నాయొద్దకు ఆకర్షించుకొందునని" ప్రభువైన యేసు సెలవిచ్చాడు (యోహాను 12:32). పౌలు యిలా వ్రాశాడు, "క్రీస్తు ప్రేమ మమ్మును బలవంతము చేయుచున్నది; ఏలాగనగా అందరికొరకు ఒకడు మృతిపొందెను గనుక అందరును మృతిపొందిరనియు, జీవించువారికమీదట తమకొరకు కాక, తమ నిమిత్తము మృతిపొంది తిరిగి లేచినవానికొరకే జీవించుటకు ఆయన అందరికొరకు మృతి పొందెననియు నిశ్చయించు కొనుచున్నాము" (2 కొరింథీ. 5:14, 15).

సిలువ దేవునిపట్ల అధికమైన ప్రేమకు స్ఫూర్తినిస్తుంది; ఒకరిపట్ల మరొకరికి అది ప్రేమ కలిగిస్తుంది. యోహాను యిలా వ్రాశాడు, "ఆయనే మొదట మనలను ప్రేమించెను గనుక మనము ప్రేమించుచున్నాము" (1 యోహాను 4:19). మన యెడల ఆయనకున్న ప్రేమను మనము అనుదినం ధ్యానించినట్టయితే, మనం ఆయనను గాఢంగా ప్రేమించి ఆకర్షితులమవుతాం. యోహాను యింకను యిలా అన్నాడు, "... మనము కూడ సహోదరుల నిమిత్తము మన ప్రాణములను పెట్ట బద్ధులమై యున్నాము" (1 యోహాను 3:16). ప్రభువైన యేసు యొక్క జీవితాన్ని గూర్చి తిరిగి ఎప్పుడు ఆలోచించినా, మారని ఆయన ప్రేమ యొక్క లోతులను కనుపరచే స్మృతి చిత్రాలే కనబడతాయి. వీటిని తిరిగి ధ్యానించినట్లయితే, ఆయనపట్ల ఆలాటి ప్రేమయే తిరిగి పుట్టుకొని వస్తుంది; ఒకరియెడల ఒకరికి కూడా అదే కలుగుతుంది: "మనమందరమును ముసుకు లేని ముఖములతో ప్రభువుయొక్క మహిమను అద్దమువలె ప్రతిఫలింపజేయుచు, మహిమనుండి అధిక మహిమను పొందుచు, ప్రభువగు ఆత్మచేత ఆ పోలికగానే మార్చబడు చున్నాము" (2 కొరింథీ. 3:18).

సిలువ పాపముపట్ల ద్వేషాన్ని, అసహ్యాన్ని మనలో కలిగిస్తుంది. కీడుకును పాడుచేయు పాపానికిని నిష్పాక్షికంగా పలికే రెండు సాక్ష్యాలున్నాయి: అందులో ఒకటి కల్వరి సిలువ, రెండవది నిత్య నాశనం యొక్క అగాధం. సిలువ యొక్క హేతువును, నరకము యొక్క ఆవశ్యకతను గ్రహించినవాడెవడును, పాపం చేయడంలో మేలు ఏమీలేదని ఒప్పుకుంటాడు. యెరూషలేమునకు వెలుపల దేవుని కుమారుడు అనుభవించిన కఠోరమైన మరణంవలన తన విమోచన కొనబడిందనే వాస్తవాన్ని దేవుని బిడ్డ మరచిపోలేడు. తన కుమారుని బలి ద్వారానే సర్వ శక్తిగల దేవుడు పాప క్షమాపణను ప్రసాదించగలడు. బుద్ధిగలవాడెవడైనా పాపాన్ని అసహ్యించుకొని, దానిని విసర్జించేలా ఆ మహా సంఘటన దృఢంగా నిరూపిస్తుంది.

క్రీస్తు యొక్క పనికి సార్వత్రికంగా మనలను మనం అప్పగించుకొనేలా సిలువ ప్రేరేపిస్తుంది. విసుగులేని పరిచర్య కొరకు ప్రోత్సాహాన్ని, అంతరంగ బలాన్ని అది ప్రసాదిస్తుంది. పౌలు యిలా వ్రాశాడు, "గ్రీసుదేశస్థులకును గ్రీసు దేశస్థులు కానివారికిని, జ్ఞానులకును మూఢులకును నేను ఋణస్థుడను" (రోమా 1:14). "అయినను నేనేమైయున్నానో అది దేవుని కృపవలననే అయియున్నాను. మరియు నాకు అనుగ్రహింపబడిన ఆయన కృప నిష్ఫలము కాలేదు గాని, వారందరికంటే నేనెక్కువగా ప్రయాసపడితిని.

ప్రయాసపడినది నేను కాను, నాకు తోడైయున్న దేవుని కృపయే"! (1 కొరింథీ. 15:10). సిలువయందు దేవుడు తనకొరకు ఏమి చేశాడో గ్రహించి, అభినందించే యథార్థ క్రైస్తవునికంటె ఎక్కువగా క్రీస్తు ప్రభువు పని చేసే క్రైస్తవుడు ఎవడును ఉండడు.

హృదయంలేని పురుషునికిచ్చి వివాహం చేయబడిన ఒక స్త్రీనిగూర్చి ప్రాచీనపు కథ ఒకటుంది. లక్ష్యపెట్టని భర్తతో జీవించవలసి వచ్చినా, వివాహంతో ఆమెకున్న బంధాన్ని బట్టి మంచి భార్యగా ఉండాలని ఆమె తీర్మానించుకుందట. అతని కొరకు ఆమె భోజనం సిద్ధపరచేది, బట్టలుతికేది, యింటిని శుభ్రంగా పెట్టేది. భార్యగా ఏమేమి చేయాలో అదంతా ఆమె చేసేది. అయితే వాటిలో ఆమెకు ఏ సంతోషమూ ఉండేది కాదు. జీవితం ఆమెకు వ్యర్థ ప్రయాసగా మిగిలిపోయింది. కడపటికి, ఆమె భర్త చనిపోయాడు, కాలక్రమంలో ఆమె మరలా వివాహం చేసికొంది. ఆమె రెండవ భర్త మొదటి భర్తకు శుద్ధ విరుద్ధమైనవాడు. ఇతడు ప్రేమిస్తాడు, అభినందిస్తాడు, ప్రోత్సహిస్తూ ఉంటాడు. చనిపోయిన భర్తకు ఎలాగో ఈ భర్తకు కూడా ఆమె అలాగే భార్య, అయితే ఒకే ఒక వ్యత్యాసం మాత్రం ఉంది – ఇప్పుడు ఆమె ప్రతి క్షణాన్ని యిష్టపడుతుంది! తన తొలి వివాహంలో బాధ్యతాపరంగా ఆమె మంచి భార్యయై ఉంది, కాని ఆమె రెండవ వివాహంలో, ఆనందాన్ని బట్టి మంచి భార్యగా ఉంది. ఓ, ప్రేమ ఎంత వ్యత్యాసాన్ని చేస్తుందో!

క్రీస్తు సంఘము తన ప్రభువు యొక్క ఆజ్ఞలను జాగ్రత్తగా అనుసరించి నడుచు కొంటుంది. ఆయన కోర్కెలను జరిగిస్తూ, ఆయన ఆలోచనలను నెరవేర్చుతుంది. విధేయతతో కూడిన జీవితాన్ని భారంగా తలంచదు. ఎందుకంటే, సంఘాన్ని బలవంతం చేసేది ఆయన కృప యొక్క అంతరంగ ప్రేరేపణయై ఉన్న ప్రేమయే. "మనమాయన ఆజ్ఞలను గైకొనుటయే దేవుని ప్రేమించుట; ఆయన ఆజ్ఞలు భారమైనవి కావు" (1 యోహాను 5:3).

క్రీస్తు ప్రభువు మనకొరకు చేసిన దానిని మనస్సులో ఉంచుకొందాం. అంతేగాక, ఆయన బలియాగాన్ని మన దైనిక జీవితపు ధ్యానంగా నిలుపుకొందాం. రక్షణ అను ఆయన వరమును గూర్చిన ధ్యానం ఆయన స్వరూపంలోనికి దినదినము మార్చుతూ ఉంటుంది. ఆయన కృపా సామ్రాజ్యంలో అదే మనలను ప్రేమ పూర్వకమైన ప్రయాసలకు నడిపిస్తుంది.

## ముగింపు

సిలువ, సంఘం అనేవి దేవునియొక్క నమూనాలో ఒకటిగా బంధింపబడ్డాయి. సంఘము సిలువచే సృజింపబడి, శుద్ధీకరింపబడి, బలవంతపెట్టబడుతుంది.

ప్రభువైన యేసు సిలువలో శ్రమపడుతూ ఉండగా, క్రిందనున్న అక్రమకారుల గుంపుల్లోనుండి నిందతో కూడిన రెండు ప్రశ్నలు ఆయన మీదికి విసరబడ్డాయి: "ఆయన తన్ను ఎందుకు రక్షించుకోలేదు?" మరియు, "దేవుడు ఆయన్ను ఎందుకు రక్షించడు?" అనేవి (మత్తయి 27:39–43). దేవుడు నిర్వహించవలసిన పునాది కార్యాన్నే వారు

గురి పెడుతున్నారనే సంగతి ఆ జనం గ్రహింపలేకపోయారు. సిలువపై క్రీస్తు మరణించకుండ దేవుడు ఆయనను తప్పించియుంటే, లేక ప్రభువైన యేసు తనను తానే రక్షించుకొని ఉంటే, సంఘం సజీవంగా ఉండడం అసాధ్యమైయుండేదే. ఎందుకంటే – తమ గత పాపాలు సిలువచే క్షమింపబడిన జనులతోనే సంఘం రూపొందింది. మరియు వారు అనుదినము సిలువచేతనే పవిత్రపరచబడువారుగా ఉన్నారు. పైగా, సిలువ లేకుండ, సంఘము దాని పురోగమనంలో అంతరంగపు నడిపింపు లేనిదై యుంటుంది. ఎలాగంటే, దేవుని ప్రజలుగా ఉండునట్లును, దేవుని విధానంలో దేవుని పని జరిగించునట్టును సంఘాన్ని బలవంతపెట్టేది సిలువయే.

ఒకవేళ నీవు సంఘానికి వెలుపలనే ఉండి ఉన్నట్టయితే, దానిలోనికి ప్రవేశింప త్వరపడు. ఎందుకో తెలుసా? సంఘంలో ప్రవేశించడంతో, సిలువ యొక్క ఉపకారాలన్నిటిని నీవు పొందుతావు. క్రీస్తు రక్తంచేత విమోచింపబడి, దేవుని పిల్లలుగా జీవించే జనుల సముదాయమే సంఘమంటే.

లోకంలోని ప్రతి వ్యక్తి దేవుని ఔదార్య భాగ్యాలను చుట్టుకొనియున్నాడు. మనం పీల్చుకొనడానికి గాలి, త్రాగడానికి నీరు, నివసించడానికి భూమి, అనుభవించడానికి కుటుంబ బాంధవ్యాలు, యింకా లెక్కలేనన్ని యితర మేళ్లను ఆయన ప్రసాదిస్తున్నాడు. దేవుడు చేసే కనికర కార్యాలన్నిటిని ఒకడు ఉదహరించాలనుకుంటే, వాడు ఓడిపోతాడు. నిస్సందేహంగా, క్రీస్తు ద్వారా ఆయన మనకు ప్రసాదించే రక్షణ తన కృప యొక్క ఉత్కృష్టమైన ముఖ వైఖరియై ఉంది. దేవునికి అది అతి మిక్కిలి వెల కలిగినదై ఉండాలి. దానిని పొందే పాపులకు అది అత్యున్నతమైన లాభాలను చెల్లిస్తుంది.

దేవుడు వారికి ప్రసాదించిన భౌతిక దీవెనలలో దేవుని కరుణా హస్తాన్ని అనేకులు చూస్తున్నారు. అయితే వారు ఆయన అంతిమ, అత్యున్నత ఉపకారాన్ని పొందకయే ఉన్నారు; అంటే వారు రక్షణ పొందకయే ఉన్నారు. ఇది నీ విషయంలో నిజమా? క్రీస్తునందలి విశ్వాసము (రోమా 10:10), పాపముల విషయమై మారుమనస్సు (అపో. 11:18), దేవుని కుమారుడుగా క్రీస్తును ఒప్పుకొనడం (రోమా 10:10), క్రీస్తులోనికి బాప్తిస్మం (గలతీ. 3:27) అనేవాటి ద్వారా క్రీస్తు శరీరంలోనికి నీవు ప్రవేశింపవచ్చు (1 కొరింథీ. 12:13), అది కృప యొక్క పరిధి, అందులో నీవు ఆయన నిత్య జీవాన్ని పొందగలవు. పౌలు యిలా అన్నాడు, "క్రీస్తు యేసులోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా?" (రోమా 6:3). "దేవుని కృపామహదైశ్వర్యమునుబట్టి ఆ ప్రియునియందు ఆయన రక్తమువలన మనకు విమోచనము, అనగా మన అపరాధములకు క్షమాపణ మనకు కలిగియున్నది" (ఎఫెసీ. 1:7, 8).

పాపక్షమాపణకును, సంఘమనే తన శరీరాన్ని సృజించే జీవులకును, ప్రభువైన యేసు తన సిలువ ద్వారా ఆహ్వానమిస్తున్నాడు. ఆయన ఆహ్వానాన్ని నీవు అంగీకరిస్తావా?

సూచనలు

[1]Henry C. Thiessen, *Lectures in Systematic Theology* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1949), 313. [2]R. A. Torrey, *What the Bible Teaches* (New York: Fleming H. Revell Co., 1898), 144.